క్లుప్తంగా

మహానందీశ్వరుడి సన్నిధిలో న్యాయమూర్తులు


మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన న్యాయమూర్తులు

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు మహానందీశ్వరుడి సన్నిధిలో పూజలు నిర్వహించారు. కర్నూలుకు చెందిన న్యాయమూర్తులు రాంభూపాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. వారితో పాటు నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

ఆర్థిక సాయం అందజేత


కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు రూరల్‌: మండలంలోని కోనేటమ్మపల్లె గ్రామానికి చెందిన బోరెల్లి వేణు నాలుగు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శాప్‌ చైర్మన్‌ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అతను పనిచేస్తున్న ఆర్‌కే ఇన్నోవేటివ్‌ సంస్థ యాజమాన్యంతో మాట్లాడి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందేలా చేశారు. యాజమాన్యం అందించిన నగదును ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు బైరెడ్డి సిద్దార్థరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తాగు నీటి సమస్యకు పరిష్కారం


విద్యుత్‌ మోటారు ఏర్పాటును పరిశీలిస్తున్న సర్పంచు, ఎంపీటీసీ

పాములపాడు: తమ గ్రామంలోని ముస్లిం మైనార్టీ, ఎస్సీ కాలనీలలో తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపామని తుమ్మలూరు గ్రామ సర్పంచు వరప్రసాద్‌, ఎంపీటీసీ సభ్యురాలు హాజిరాబీ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ కాలనీలో రూ.50 వేలు ఖర్చు చేసి నూతన విద్యుత్‌ మీటర్‌ ఏర్పాటు చేశామన్నారు. ఎస్సీ కాలనీలో మోటారుకు మరమ్మతులు చేయించి కుళాయిలకు నీటిని సరఫరా చేయించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


నేడు ఎడ్ల బలప్రదర్శన పోటీలు

మహానంది: మహానందిలో శనివారం అఖిల భారత ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. ఎథిక్స్‌ కమిటీ చైర్మన్‌, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పోటీలను ప్రారంభిస్తారన్నారు. సీనియర్స్‌, సబ్‌ జూనియర్స్‌, న్యూ కేటగిరీ విభాగాల్లో రాష్ట్రస్థాయి వృషభ బలప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్‌

పగిడ్యాల: తెలంగాణ రాష్ట్రం నుంచి కృష్ణానది మీదుగా పి.లింగాపురం, కోళ్లబవాపురం గ్రామాలకు తరలిస్తున్న నాటుసారాను స్వాధీనం చేసుకుని, విక్రేతలను అరెస్ట్‌ చేసినట్లు ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్‌ శుక్రవారం తెలిపారు. జూపాడుబంగ్లా మండలం పి.లింగాపురం గ్రామానికి చెందిన ఎం. మధు, ఎస్‌. శ్రీరామ్‌, నందికొట్కూరు మండలం కోళ్లబవాపురం గ్రామానికి చెందిన కేశవ, శివకుమార్‌ తెలంగాణ నుంచి బోటులో తరలిస్తున్న 90 లీటర్ల నాటుసారాను పాత ఎల్లాల వద్ద స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురు నిందితులపై ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ యాక్ట్‌ ప్రకారం కేసు నమోదు చేసి రెండు బైక్‌లను సీజ్‌ చేశామన్నారు. నిందితులను నందికొట్కూరు కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్‌ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతి చెందిన సంజీవరెడ్డి

డోన్‌ రూరల్‌ : మండల పరిధిలోని చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి(51) అనే వ్యక్తి శుక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందాడని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని భారత్‌ గ్యాస్‌ ఎదురుగా ఉన్న మహి గ్రానైట్స్‌ దగ్గర సంజీవరెడ్డి అనే వ్యక్తి నోట్లో రక్తం కక్కుకొని అనుమానాస్పదంగా మృతి చెందాడు. అక్కడ తిరుగుతున్న ప్రజలు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. విచారించగా సంజీవరెడ్డి గ్రామంలో చికెన్‌ సెంటర్‌ నిర్వహించేవాడని తేలింది. కర్నూలుకు వెళ్లి డబ్బులు తీసుకొస్తానని గురువారం ఇంట్లో ఉన్న భార్య లక్ష్మీదేవికి చెప్పి వెళ్లాడు. మృతదేహాన్ని డోన్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఇలకైలాసం.. భక్తజనసంద్రం

- శివభక్తులతో ఆధ్యాత్మిక శోభితమైన శ్రీశైలక్షేత్రం
- మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు


ఇరుముడులతో దర్శనానికి వెళ్తున్న శివమాల ధారులు



నందివాహన సేవను ప్రారంభిస్తున్న చైర్మన్‌, తదితరులు, రుద్రకోడూరు క్షేత్రం వద్ద భక్తుల కోలాహలం

శ్రీశైలంటెంపుల్‌/ఆత్మకూరు: ఇలకైలాసం.. శ్రీశైలం శివమయమైంది. శివభక్తులతో క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులు శివ నామస్మరణలు, భజనలు చేసుకుంటూ పరమేశ్వరుడి సేవలో తరించారు. క్షేత్ర ప్రధాన వీధులన్నీ శివభక్తులతో నిండిపోయాయి. ఓం నమఃశివాయ, శంభో..శంకరా, ఓం శివోహం అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో మరింత ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టి పడింది. సాక్షాత్తూ పరమేశ్వరుడు ఉద్భవించిన మహాశివరాత్రి నాడు శివున్ని దర్శించుకునేందుకు భక్తులు లక్షలాదిగా పోటెత్తారు. పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అలాగే శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని శివుడికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

- శ్రీశైలంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు వేకువజాము రెండు గంటల నుంచి స్వామివారి దర్శనానికి అనుమతించారు. దర్శనానికి సుమారు 6 గంటల సమయం పట్టింది. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, మజ్జిగ, అల్పాహారం అందించింది. పాగాలంకరణ, కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు శ్రీశైలంలోనే బస చేశారు.
- శ్రీశైల క్షేత్రంలో భ్రమరాంబామల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వీవీపీలు పోటీ పడ్డారు. వీవీపీల గేట్లు తెరవగానే త్వరగా లోపలకు వెళ్లాలనే ఉద్దేశంతో ఒకరినొకరు తోసుకుంటూ వెళ్లడంతో పోలీస్‌సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు.
- పాదయాత్ర భక్తుల కోసం కైలాసద్వారం, హఠకేశ్వరం, సాక్షిగణపతి, శివదీక్షా శిబిరాలు ఇతర ఖాళీప్రదేశాలలో టెంట్లు, షామియానాలను దేవస్థానం ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్య శాఖ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయగా, దేవస్థానం తాగునీటి సౌకర్యాన్ని కల్పించింది. దేవస్థానం పరిధిలోని అన్ని సత్రాల వారు శివస్వాములకు, సాధారణ భక్తులకు ఉచిత భోజనసౌకర్యాలను ఏర్పాటు చేశారు.
- నల్లమల అటవీపరిధిలోని రుద్రకోడు పుణ్యక్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలాచరించుకున్న భక్తులు రుద్రకోటేశ్వర స్వామికి విశేషపూజలు నిర్వహించారు.


ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకొస్తున్న ఈఓ పెద్దిరాజు, తదితరులు


ఆలయ రహదారిపై చేరుకున్న భక్తుల క్యూలైన్‌

కిక్కిరిసిన మహానంది


నందీశ్వరుడికి అభిషేక పూజలు,


మహానందీశ్వరస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మహానంది: మహా శివరాత్రి పురస్కరించుకుని మహానంది ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. భక్తులు చిన్నకోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. స్వామి వార్లకు టీటీడీ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి దర్శనానికి భక్తులకు రెండు గంటలకు పైగా సమయం పట్టింది. రాత్రి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివారు నంది వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, సీఎఫ్‌ఓ పట్టెం గురుప్రసాద్‌, ఏఈఓలు వై.మధు, ఓంకారం వెంకటేశ్వరుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

- మహానందీశ్వరుడి భక్తులకు పలువురు దాతల సహకారం అందించారు. నంద్యాల విజయ డెయిరీ చైర్మన్‌ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎండీ ప్రదీప్‌కుమార్‌ ఆధ్వర్యంలో పదివేల మందికి మజ్జిగ పంపిణీ చేశారు. నంద్యాలకు చెందిన కూరాకు రవీంద్రనాథ్‌ సాంస్కృతిక కార్యక్రమాల కోసం రూ.25 వేల నగదు అందించారు. గుంటూరు జిల్లా చిర్రావూరుకు చెందిన కాటూరి రాము 360 కిలోలు, కర్నూలుకు చెందిన దుర్గా స్వీట్స్‌ బేకరీ అధినేత రెల్లు వెంకటేశ్వరరావు 240 కిలోల పచ్చళ్లు అందించారు.
- సూర్యనందీశ్వరస్వామి దేవస్థానం వద్ద జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. వెలుగోడు జిల్లా పరిషత్‌ పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం, నెరవాడ కేశవరెడ్డి స్కూల్‌ ద్వితీయ స్థానం, వేల్పనూరు జెడ్పీహెచ్‌ఎస్‌ మూడో స్థానం, నెరవాడ కేశవరెడ్డి నాలుగో స్థానం సాధించాయి. వీరికి వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందించారు.
- బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలోనూ భక్తుల సందడి కనిపించింది. భక్తులు గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాటు చేశారు.
- మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరుతో పాటు పీరుసాహెబ్‌ పేట, పైపాలెం, నాగలూటి, మాసపేట, చౌట్కూరు, దేవనూరు, చెరుకుచెర్ల, తలముడిపి, అలగనూరు, రోళ్లపాడు తదితర గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రామేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, కుంకుమార్చన, తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు.
- పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్‌ భ్రమరాంబా మల్లికార్జున స్వామి ఆలయం, బీరవోలులోని భీమలింగేశ్వరస్వామి ఆలయం, పగిడ్యాల సర్వేశ్వరస్వామి ఆలయం, కోట వీధిలోని శివాలయం, తూర్పు, పడమర ప్రాతకోట నాగేశ్వరస్వామి, మోక్షేశ్వరస్వామి, నందీశ్వర, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, లక్ష్మాపురం పార్వతీ సమేత ఈశ్వర ఆలయం, పాత, కొత్త ముచ్చుమర్రిలోని సంగమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉదయాన్నే పవిత్ర స్నానాలు ఆచరించి శివనామ స్మరణ చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కళాకారుల కోసం రూ. 25వేలు అందిస్తున్న దాత రవీంద్రనాథ్‌


పట్టువస్త్రాలు అందిస్తున్న టీటీడీ అధికారులు


ప్రత్యేక అలంకరణలో రామేశ్వర స్వామి


నందీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు


భక్తులను అనుగ్రహిస్తున్న శంకరమల్లేశ్వర, భ్రమరాంబికమాత


స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

జూపాడుబంగ్లా: నందికొట్కూర్‌ నియోజకవర్గంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మండలంలోని తూడిచెర్ల, జూపాడుబంగ్లా, తాటిపాడు, తంగడంచ, తర్తూరు, పారుమంచాల, తరిగోపుల, 80 బన్నూరు, పి.లింగాపురం గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు ఉదయాన్నే చేరుకుని శివలింగాలకు పంచామృతం, బిల్వపత్రాలతో అభిషేకాలు నిర్వహించారు.


మల్యాలలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వీరబ్రహ్మేంద్రుని కల్యాణం..

నందికొట్కూరు రూరల్‌: నియోజకవర్గంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మల్యాల గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పరస్కరించుకుని వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణాన్ని ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.

- పాములపాడు: మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. భవనాశి నది ఒడ్డున వెలసిన, శ్రీశైలానికి ప్రథమ ముఖ ద్వారమైన నందీశ్వరాలయానికి చుట్టుక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. ఇస్కాల గ్రామంలో నందికోల సేవతో నందీశ్వర స్వామికి ఊరేగింపు నిర్వహించారు.


ఇస్కాల గ్రామంలో నందీశ్వరస్వామి ఊరేగింపులో నందికోల సేవ

- కొత్తపల్లి: మండలంలోని సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆలయంలోని వేపధారు శివలింగాన్ని అలంకరించి, రుద్రాభిషేకం, నదిజలలాతో అభిషేకం, మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. రాత్రి లింగోద్భవ పూజా కైంకర్యాలు నిర్వహించారు. భక్తులు సప్తనదులలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగాదేవికి విశేష పూజలు చేసుకొని, నదిజలాలలో దీపాలను వదిలి భక్తిని చాటుకున్నారు.


సంగమేశ్వరం వద్ద సప్తనదులలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

రక్త నిల్వ కేంద్రం ప్రారంభం


రక్తనిల్వ కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్‌: స్థానికప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్త నిల్వ కేంద్రాన్ని శుక్రవారం అసెంబ్లీ ఎథిక్స్‌ కమిటీ చైర్మన్‌, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించారని డాక్టర్లకు సూచించారు. డాక్టర్లను ప్రజలు దేవుడిగా భావిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని గ్రూపులకు చెందిన రక్త యూనిట్లు, ఒక్కో గ్రూపుకు రెండు యూనిట్లు ఉండేలా నిల్వ చేసే ఫ్రీజర్లు, అవసరమైన రక్తాన్ని నంద్యాల జీజీహెచ్‌ నుంచి తెప్పించుకొని నిల్వ ఉంచేలా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే కిడ్నీ, లివర్‌ ఫంక్షన్‌ తెలుసుకునే మిషనరీ, రక్తంలో ఉన్న కలుషితాలను గుర్తించే పరికరాల ప్రక్రియను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు షోహైల్‌, బి.మహేశ్వరరెడ్డి, విజయభార్గవ్‌, పి.జాన్సీరాణి, వినయ్‌, యజ్ఞప్రసాద్‌, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు జింకా గుండయ్యయాదవ్‌, మైనారిటీ సెల్‌ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ రజాక్‌, మండల నాయకులు భరత్‌రెడ్డి, గౌస్‌మొహిద్దీన్‌, దానియేల్‌ పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

డోన్‌ టౌన్‌: పట్టణంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ బాలికల గురుకుల పాఠశాలలో ఈ నెల 10వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ ఎస్తేర్‌ గీత తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్మీడియెట్‌ మొదటి సంవత్సరం ప్రవేశానికి పరీక్ష ఉంటుందని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు అభ్యర్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్‌, ఆధార్‌ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు.

మల్లన్నను దర్శించుకున్న దేవదాయశాఖ మంత్రి

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో మంత్రి దంపతులకు వేద పండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేష వస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.


మంత్రి దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఉత్సవాల ప్రత్యేక అధికారి ఆజాద్‌

నిబంధనలకు నీళ్లు

- 20 మంది పట్టే బోట్లలో 70 మందిని తరలిస్తున్న వైనం
- భక్తుల ప్రాణాలతో బోట్ల నిర్వాహకుల చెలగాటం

కొత్తపల్లి: మహాశివరాత్రి పర్వ దినాన బోట్ల నిర్వాహకులు నిబంధనలకు నీళ్లొదిలారు. 20 మంది ప్రయాణికులు పట్టే బోట్లలో ఏకంగా 70 మంది వరకు ఎక్కుంచుకుని కృష్ణానదిలో ప్రయాణి చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని సప్తనది తీరాన వెలసిన సంగమేశ్వరాలయాన్ని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వస్తుంటారు. తెలంగాణ నుంచి భక్తులు అధికసంఖ్యలో అవతలి నుంచి ఇవతలికి మరబోట్లలో రాకపోకలు సాగిస్తుంటారు. మరబోట్లు కృష్ణానదిలో తిప్పకూడదనే నిబంధనలు ఉన్నా రెండు రాష్ట్రాల బోటు నిర్వాహకులు లెక్కచేయకుండా కాసుల కోసం భక్తులను పరిమితికి మించి ఎక్కుంచుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. 20 మంది పట్టే బోటులో 70 మందిని ఎక్కించుకుని లైఫ్‌ జాకెట్లు, లైసెన్సులు లేకుండానే రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.100 నుంచి రూ.150 దాకా వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. జరగరానిదేదైనా జరిగితే ఎవరు బాధ్యులని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోట్ల నిర్వాహకుల ఆగడాలను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.


పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న బోటు

ఘనంగా మహిళా దినోత్సవం


నందికొట్కూరులో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు అఖిరా, హిమవర్షిణి, శ్రీనివాసులు, టీబీ సూపర్‌వైజరు చెరుకు రవి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు మల్‌రెడ్డి నాగన్న, గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్‌, సభ్యులు చిన్న నాగన్న, శేషమ్మ, వెంకటరమణ, షేక్షావలి, సరస్వతి, నాగమద్దిలేటి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లాలో..

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఫ్రెండ్స్‌ హెల్ప్‌ యూత్‌ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు కేక్‌ కట్‌ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్‌హెల్ప్‌ యూత్‌ అధ్యక్షుడు గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.


కేక్‌ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న మహిళలు

కుందూనదికి నీటి విడుదల


కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని కుందూనదికి అధికారులు నీటిని విడుదల చేశారు. స్థానిక వ్యవసాయ సబ్‌ డివిజన్‌లోని కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, రైతులకు తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోతిరెడ్డిపాడు హెడ్‌ రెగ్యులేటర్‌ నుంచి నీటిని విడుదల చేశారు. మార్చి నెలలో సైతం నదిలో నీరు పుష్కలంగా చేరడంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజులు వైన్‌ షాపు బంద్‌

మహానంది: మహాశివ రాత్రి ఉత్సవాల నేపథ్యంలో మహానందిలోని వైన్‌ షాపును మూడు రోజుల పాటు(8, 9, 10 తేదీలు) మూసివేస్తున్నట్లు ఎక్సైజ్‌ సీఐ దేవిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్‌ బత్తుల నాగరాజు పాల్గొన్నారు.